

ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 29.0 కనిష్ఠం : 22.0
ANDHRAJYOTHY 5 నాగర్‌కర్నూల్ జిల్లా వార్తలు
బుధవారం 7 ఆగస్టు 2024





చెంచు లక్ష్మీ మ్యూజియంలో విరిగిపోయిన చెంచుల బొమ్మలు



మన్ననూరులోని చెంచు లక్ష్మీ మ్యూజియం

నేతన్నలపై చిన్నచూపు

- నిలిచిన 'నేతన్నకు చేయూత' పథకం నిధులు
- అందని ద్రాక్షగా చేనేత రుణమాఫీ
- తీవ్ర ఇబ్బందుల్లో కార్మికుల కుటుంబాలు
- నేడు జాతీయ చేనేత దినోత్సవం





రాజోలిలో పట్టు దారాన్ని కండెలుగా చుడుతున్న చేనేత వృద్ధురాలు

రాజోలి, ఆగస్టు 6 : రాష్ట్రంలో జోగుళాంబ గద్వాల జిల్లా అంటే చేనేత రంగానికి పెట్టింది పేరు. అలాంటి చేనేత రంగం జిల్లాలో నేడు కనుమరుగవుతోంది. పెట్టుబడి భారమై.. ప్రభుత్వం ఆదరణ కరువై.. చేనేత కార్మికుల జాడ కనుమరుగవుతోంది. ప్రతీ ఏడాది ఆగస్టు 7వ తేదీన జాతీయ చేనేత కార్మికుల దినోత్సవాన్ని అధికారులు ఘనంగా జరుపుకుంటున్నారు. కానీ చేనేత కార్మికులకు ప్రభుత్వం నిధులు అందించడంలో చిత్తశుద్ధి చూపడం లేదని నేతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా మొత్తం 4,500 కుటుంబాల్లో 15 వేల మందికి పైగా కార్మికులు చేనేత రంగాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. నాగర్‌కర్నూలులో ఎనిమిది మంది, మహబూబ్‌నగర్‌లో 1,000 మంది, నారాయణపేటలో 1,832 మంది, వనపర్తిలో 1,021 మంది, గద్వాల జిల్లాలో 7,088 మంది చేనేత కార్మికులు ఉన్నట్లు అధికారుల ద్వారా తెలుస్తోంది. గద్వాల జిల్లాలో 3,800 జియోట్యాగ్ మగ్గాలు ఉండగా, వీటిపై ఆధార పడి 3,786 మంది ప్రధాన కార్మికులు, 4,487 మంది అనుబంధ కార్మికులు మొత్తం 7,088 మంది చేనేత వృత్తి పని చేస్తున్నారు. జిల్లా కేంద్రంతో పాటు రాజోలి, అయిజ, గట్టు, అరగిద్ద, మాచర్ల, అలంపూర్, ప్రాగటూర్ తదితర ప్రాంతాల్లో ఎక్కువగా చేనేత వృత్తి పై ఆధార పడ్డ కుటుంబాలు ఉన్నాయి.

ప్రభుత్వం అందిస్తున్న పథకాలు

చేనేత కార్మికులకు నేతన్నకు చేయూత పథకం ద్వారా కార్మికుడి ఖాతాలో నగదు జమ చేసే విధంగా త్రిఫ్టఫండ్ పథకాన్ని రూపొందించారు. ఒక చేనేత కార్మికుడి నెలసరి ఆదాయంలో ఎనిమిది శాతం ఆర్డీ-1 ఖాతాలో జమచేస్తే, రాష్ట్ర ప్రభుత్వం ఆర్డీ-2 ఖాతాకు 16 శాతం నగదును జమ చేస్తుంది. ఈ మొత్తం ప్రీమియం మూడు సంవత్సరాల అనంతరం కార్మికుడికి మగ్గం నైపుణ్యతకు ఉపయోగించుకోవచ్చు. చేనేత కార్మికులకు ఉపయోగపడే పథకం అంటే ఈ త్రిఫ్టఫండ్ పథకమే అని కార్మికులు చెబుతున్నారు. అయితే 10నెలలుగా ప్రభుత్వం నుంచి ఆర్డీ-2 ఖాతాలో జమ చేయడం లేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా మొత్తం రూ. 9.67 కోట్లు బకాయి ఉన్నట్లు నేతన్నలు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉంటే చేనేత రుణమాఫీ, చేనేత మిత్ర పథకాలు అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కదలిక లేని చేనేత క్లస్టర్

జోగుళాంబ గద్వాల జిల్లాలో మొత్తం 2,500 మగ్గాలు ఉండగా మొత్తం జిల్లాకు మూడు క్లస్టర్లు మంజూరు అయ్యాయి. ఇందులో మొదటి విడతగా గద్వాల క్లస్టర్ పరిధిలో 272 మంది చేనేత కార్మికులకు రూ. 0.94 కోట్లు, గట్టు క్లస్టర్‌కు 564 మంది కార్మికులకు రూ. 1.60 కోట్లు, రాజోలి క్లస్టర్ 400 మంది చేనేత కార్మికులకు రూ. 1.30 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధులతో అధునాతన యంత్రాలు, డిజైన్లు, పట్టుదారాలకు రంగుల అద్దకంపై శిక్షణ ఇస్తారు. అనంతరం వారి మగ్గాలకు అవసరమైన మోటార్ జాక్వార్డులు, ఫ్రేమ్ మగ్గాలు, జాక్వార్డు లిఫ్టింగ్ యంత్రాలను ప్రభుత్వం 90 శాతం రాయితీతో కార్మికులకు అందించాల్సి ఉంది. 10 శాతం కార్మికులు చెల్లించాల్సి ఉంటుంది. ఈ పథకంలో ఇంత వరకు కదలిక లేదని నేతన్నలు అంటున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



అర్హులైన కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం. త్రిఫ్టఫండ్ నిధులు పెండింగ్‌లో ఉన్నది వాస్తవమే. అవికూడా త్వరలో వస్తాయి. కార్మికులు ఆందోళనకు గురికావద్దు. ప్రభుత్వం నుంచి అందాల్సిన అన్ని పథకాలను అందేలా కృషి చేస్తాం.

- గోవిందయ్య, చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకుడు, గద్వాల జిల్లా

రుణాలు మాఫీ చేయాలి

వృత్తిని వీడలేక, తెచ్చుకున్న బ్యాంకు రుణాలు చెల్లించలేక బతుకు భారమైంది. రైతు రుణమాఫీ మాదిరిగానే ప్రభుత్వం చేనేత రుణాలు కుడా మాఫీ చేయాలి. నేతన్నకు అందాల్సిన పథకాలను పూర్తి స్థాయిలో అందేలా చూడాలి.

- కామూర్తి బత్తలయ్య, రాజోలి చేనేత కార్మికుడు

మగువల మనసుదోచే పేట చీరలు

- టెంపుల్ బార్డర్ పేట ప్రత్యేకత




పేటలో మగ్గంపై చీరను నేస్తున్న కార్మికురాలు

నారాయణపేట :నారాయణపేట పట్టు చీరలకు ఎంతో ఖ్యాతి ఉంది. నేత కార్మికులు చేతికళా నైపుణ్యంతో ఎన్నోరకాల డిజైన్ల చీరలను ఉత్పత్తి చేసే కుటుంబాలు వందలాదిగా ఉన్నాయి. పేట చీరలు విభిన్నమైన డిజైన్లలలో మగువల మనసులను దోచేస్తున్నాయి. వ్యవసాయ రంగం తర్వాతి స్థానాన్ని పొందిన చేనేత రంగం రానురాను సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. త్రిఫ్టఫండ్, చేనేత మిత్ర (నూలుసబ్సిడీ), చేనేత బీమా పథకాలను కొత్తగా ప్రవేశ పెట్టినా కొంతమేర కార్మికులకు ప్రయోజనం చేకూరుతుంది. చేనేత కార్మికుల శ్రమకు గుర్తింపును, గౌరవాన్నిస్తు ప్రకటించిన జాతీయ చేనేత దినోత్సవాన్ని భారత ప్రధాని నరేంద్ర మోదీ 2015 ఆగస్టు 7న చెన్నైలో తొలి జాతీయ దినోత్సవాన్ని ప్రారంభించారు. కంచి, ధర్మావరం, గద్వాల చీరలకు ఉన్న ప్రాధాన్యత, ప్రావీణ్యత పేట చేనేత చీరలకు ఉంది. చేనేత నిర్లక్ష్యానికి గురి కావడంతో కార్మికుల కు కష్టాలు తప్పడం లేదు. సంక్షోభం నుంచి చేనేతను గట్టెక్కించేందుకు ప్రభుత్వం చేనేత కార్మిక కుటుంబాలకు వడ్డీ లేకుండా లక్ష వరకు రుణ సౌకర్యం కల్పించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ముడి సరుకులను ప్రభుత్వం సబ్సిడీపై నేరుగా కార్మికులకు అందించి వారు తయారు చేసిన చీరలను కూడా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

శిథిలావస్థలో.. చెంచు లక్ష్మి మ్యూజియం

- రంగు నెరసిన చెంచుల జీవ వైవిధ్యపు బొమ్మలు
- మూతపడిన పర్యాటక హోటల్
- అభివృద్ధి చేసి ఉపాధి చూపాలంటున్న చెంచు యువత



మన్ననూరులోని చెంచు లక్ష్మి మ్యూజియంలో రంగులు నెరసి కళావిహీనంగా మారిన బొమ్మలు

మన్ననూర్, ఆగస్టు 6: నాగర్‌కర్నూలు జిల్లాలోని మన్ననూరు ఐటీడీఏ పరిధిలో గల చెంచుల జీవన విధానాన్ని పర్యాటకులకు తెలిపే చెంచులక్ష్మి మ్యూజియం నిర్వహణకు నోచుకోవడం లేదు. 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చెంచుల సంస్కృతిని చాటిచెప్పేలా మ్యూజియాన్ని ఏర్పాటు చేశారు. ఈ మ్యూజియంలో చెంచుల జీవన విధానం ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన మైనపు బొమ్మలు శిథిలావస్థకు చేరుకున్నాయి. అంతే కాకుండా ఈ మ్యూజియాన్ని సందర్శించిన పర్యాటకులకు అక్కడే భోజనం అందించేందుకు హోటల్‌ను ఏర్పాటు చేశారు. చెంచు యువకులు, మహిళా సంఘాల సభ్యులు హోటల్, మ్యూజియంలో పని చేస్తూ ఉపాధి పొందేవారు. కానీ హోటల్ మూసివేయడంతో ఉపాధి కోల్పోయామని స్థానిక చెంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పనిచేసిన పలువురు కలెక్టర్లు సైతం మ్యూజియాన్ని సందర్శించి కొత్త హంగులతో తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చినా అమలుకు నోచుకోవడంలేదు. ఇటీవల నల్లమలలో పర్యటించిన మంత్రి సీతక్క సైతం మ్యూజియాన్ని అభివృద్ధి చేస్తామని మాట ఇచ్చారు. నల్లమలను పర్యాటక హబ్‌గా చేయాలని ఇద్దరు మంత్రులు ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్యేలు సైతం నల్లమలలోని పలు పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. వారు చేపట్టే టూరిజం అభివృద్ధిలో ఈ పర్యాటక హోటల్, కాటేజీలు, చెంచుల సాంస్కృతిక కేంద్రాలను అభివృద్ధి చేసేందుకు పెద్దపీట వేస్తే శ్రీశైలం వెళ్లి వచ్చే పర్యాటకులకు చక్కటి విడిది ప్రాంతమయ్యే ఆస్కారం ఉంది. రెండు నెలల క్రితం గిరిజన సంక్షేమశాఖ సెక్రెటరీ శరత్ ఈ కేంద్రాన్ని సందర్శించి పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని స్థానిక అధికారులకు సైతం ఆదేశాలు జారీ చేశారు.

నిర్వహణ బాధ్యత ప్రైవేట్ సంస్థకు అప్పగించాం

చెంచులక్ష్మి మ్యూజియాన్ని పిరమిడ్ అనే ప్రైవేటు సంస్థకు అప్పగించాం. ఈ సంస్థ ద్వారా హోటల్, కాటేజీలు మరమ్మతులు చేయడంతో పాటు నిర్వహణను కూడా వాళ్లే చూసుకుంటారు. ఇందులో భాగంగానే జిల్లా పరిధిలోని చెంచులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రభుత్వంతో ఆ సంస్థ ఒప్పందం కుదుర్చుకున్నది.

- జాఫర్ హుసేన్ , ఐటీడీఏ ఏవో

ఉత్తుత్తి కిడ్నాప్

- కోట్లకు కుచ్చుటోపీ వ్యవహారంలో పథకం ప్రకారమే పలాయనం
- చీటీల పేరిట కూడా పేదలను వంచించిన చోటేమియా

నాగర్‌కర్నూల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : అమాయక జనాన్ని వంచించి కోట్ల రూపాయలు కుమ్మేసిన చోటేమియా(జహీర్) పథకం ప్రకారమే పలాయానం చిత్తింగించినట్లు తెలుస్తోంది. అందుకు అతడి బంధువులు పూర్తిస్థాయిలో సహకారమందించారు. బాధితుల నుంచి ఎదురుదాడిని తప్పించుకోవడానికే చోటేమియా కిడ్నాప్ డ్రామా ఆడాడు. సోమవారం నడిగడ్డ, అచ్చంపేట, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ ప్రాంతాలల్లో అధిక వడ్డీ ఆశ చూపి సేకరించిన సొమ్ముకు సంబంధించి లెక్కలు తేల్చుకోవాల్సి ఉంది. ఈ క్రమంలో దాదాపు 70మంది బాధితులు ప్రధానంగా మహిళలు నాగర్‌కర్నూల్‌కు వచ్చారు. వారికి ఉదయం ఏడు గంటలకు సమయమిచ్చిన చోటేమియా ఎనిమిది గంటలు అయినా రాలేదు. తనకు జ్వరం వచ్చిందని హాస్పిటల్‌లో చూపించుకుని వస్తానంటూ నమ్మబలికాడు. ఎనిమిది గంటలు దాటిన తర్వాత కూడా అతను రాకపోవడంతో బాధితుల తరపు నుంచి అతనికి ఫోన్ వెళ్లింది. ఎవరెవరికీ ఎంత ఇవ్వాలో లెక్క చేస్తున్నానని మరో 10 నిమిషాల్లో బాధితుల వద్దకు వస్తానని ఫోన్లలో మేసేజ్ పెట్టాడు. 8:30గంటల తర్వాత తిరిగి అతని కోసం ప్రయత్నించగా తను వాడుతున్న దాదాపు పది సిమ్‌కార్డు నెంబర్లన్నీ స్విచ్ఛాఫ్ వచ్చాయి. బాధితులు అతని బంధువులను ప్రశ్నించగా 10నిమిషాల తర్వాత వారి వద్ద నుంచి సమాచారం వచ్చింది. బాధితుల వద్దకు వస్తున్న చోటేమియాను హౌసింగ్‌బోర్డు వద్ద గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారని ఆ మేసేజ్ నడిగడ్డకు చెందిన తమ బంధువుకు చేరిందని సమాధానం వచ్చింది. దీంతో బాధితుల్లో ఆగ్రహం వ్యక్తమైంది. సంవత్సరం నిరీక్షణ తర్వాత అంత దూరం నుంచి వచ్చిన తమను ఉద్దేశపూర్వకంగా మోసగిస్తున్నారంటూ వారి కుటుంబ సభ్యులను నిలదీశారు. ఆ తర్వాత ఇరుపక్షాల వారు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. చోటేమియా కుటుంబ సభ్యులు బాధితుల మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. వ్యూహం ప్రకారమే చోటేమియా బాధితులను కలవకుండా తప్పించుకున్నాడు. తన భర్తను కిడ్నాప్ చేశారని పేర్కొంటున్న చోటేమియా భార్య, బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం. హౌసింగ్‌బోర్డు నుంచి చోటేమియాను కిడ్నాప్ చేశారని అతని భార్య ఆరోపిస్తుండగా సీసీ ఫుటేజీల్లో ఎక్కడా ఆ దృశ్యాలు లేకపోవడం గమనార్హం.

అధిక వడ్డీ ఆశ చూపి జనం నుంచి డబ్బులు వసూలు చేసిన చోటేమియా చీటీల పేరుతో కూడా సామాన్య మహిళలను మోసగించాడు. 5, 10, 15లక్షల చీటీలను కొనసాగించిన చోటేమియా కాలపరిమితి ముగిసిన తర్వాత కూడా వారికి సొమ్ము చెల్లించకపోవడంతో మహిళల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. విచారకరమైన అంశమేమిటంటే చోటేమియా దగ్గర అధిక వడ్డీ, చీటీల పేరుతో డబ్బు ఇచ్చిన మహిళలంతా ఒక దుకాణంలో బంగారు తాకట్టు పెట్టారు. వచ్చే నెలలో బంగారం తీసుకోకుంటే తాకట్టు పెట్టిన బంగారం బహిరంగ వేలం నిర్వహించనున్నారు.

ఉద్యోగం పేరుతో మోసం

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- మోసగాళ్ల ఉచ్చులో మరికొందరు

గద్వాల క్రైం, ఆగస్టు 6 : హలో.. నీకు ఉద్యోగం కావాలా.. అయితే గద్వాల కలెక్టరేట్‌లో ఉద్యోగాలు ఉన్నాయి. ప్రస్తుతానికి కంప్యూటర్ పోస్టుతో పాటు అటెండర్ పోస్టులు కూడా ఉన్నాయి. నేను వేరే జిల్లా కలెక్టరేట్‌లో పనిచేస్తున్నాను. నాకు గద్వాల జిల్లాలోని ఉన్నతాధికారులతో పాటు హైదరాబాద్‌లో ఉన్న సెక్రేరియేట్‌లో ఓ వ్యక్తి బాగా తెలుసు. నేను చెబితే నీకు ఉద్యోగం వచ్చేస్తుంది అని నమ్మించి నిరుద్యోగులను బుట్టలో వేసుకుంటున్న మోసగాళ్లు గద్వాలలో అనేకం. అందులో ఓ యువకుడు గద్వాలకు చెందిన ఓ నిరుద్యోగికి మాయమాటలు చెప్పి రూ. 3 లక్షలు కాజేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

గద్వాల పట్టణం బీరెల్లిరోడ్డు సమీపంలో నివాసం ఉంటున్న గొల్ల కృష్ణయ్య అనే బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అతడు డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగం కోసం వెతుకుతున్నాడు. పట్టణానికి చెందిన ఓ యువకుడు అతడికి పరిచయమై రూ.3 లక్షలు లంచం ఇస్తే గద్వాల కలెక్టరేట్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పాడు. ఇందులో రూ. 1.50 లక్షలు హైదరాబాద్‌లోని ఓ వ్యక్తికి ఇవ్వాలి, మిగితాది నాకు ఇవ్వాలని ఒప్పందం కుదుర్చుకున్నాడు. గత ఏడాది విడతల వారీగా హైదరాబాద్‌లోని వ్యక్తికి నగదు, ఫోన్ ద్వారా రూ. 1.50 లక్షలు ముట్టజెప్పాడు. అలాగే గద్వాలకు చెందిన వ్యక్తికి కూడా నగదు, ఫోన్‌పే ద్వారా రూ.1.50లక్షలు చెల్లించాడే. తీరా ఉద్యోగం ఇవ్వకపోవడంతో డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేస్తే ఈ ఏడాది ఫిబ్రవరిలో మైన్‌క్రాఫ్ట్ మ్యాన్ పవర్ సొల్యూషన్ పేరుతో ఉన్న ఒక లెటర్‌ను ఇస్తూ ఇది నీ జాయినింగ్ ఆర్డర్ నీవు కలెక్టరేట్‌లో అటెండర్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహించవచ్చు తెలిపాడు. ఆ లెటర్‌ను కలెక్టరేట్‌లోని ఓ అధికారికి చూపించడంతో ఇది జాయినింగ్ ఆర్డర్ కాదని, ఎవరో మోసం చేసారని చెప్పడంతో వెంటనే వారిని నిలదీశాడు. డబ్బులు అప్పుడు, ఇప్పుడు ఇస్తామని చెప్పడంతో ఊరికే ఉన్నాడు. నేటికీ డబ్బులు ఇవ్వకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశానని బాధితుడు తెలిపాడు. కృష్ణయ్య లాంటి వారు గద్వాలలో ఎందరో మోసపోతున్నారు. పోలీసులు వీరిపై నిఘా ఉంచి నిరుద్యోగులను మోసగాళ్ల వలలో చిక్కుకోకుండా కాపాడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని పట్టణ ప్రజలు అభిప్రాయపడుతున్నారు. పోలీసులు పూర్తిస్థాయిలో విచారిస్తే ఈ మోసగాడి వలలో ఎంతమంది నిరుద్యోగులు పడ్డారో తెలుస్తుందనే స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఉద్యోగాల పేరిట మోసం చేస్తే చర్యలు



ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఉద్యోగం పేరిట రూ. 3 లక్షలు తీసుకొని మోసం చేసినట్లు గద్వాలకు చెందిన వ్యక్తితో పాటు హైదరాబాద్‌కు చెందిన వ్యక్తిపై గొల్ల కృష్ణయ్య ఫిర్యాదు సోమవారం చేశారు. దీనిపై విచారించి చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

- శ్రీనివాస్, పట్టణ ఎస్ఐ

సాంకేతిక లోపంతో నెట్టెంపాడు

ఫేజ్-1 పంపులు నిలిపివేత

- అయోమయంలో రైతులు



నిలిచిన నెట్టెంపాడు పంపింగ్

ధరూరు, ఆగస్టు 6 : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు కింద నెట్టెంపాడు ఫేజ్-1 పంపులు సాంకేతిక సమస్యలతో సోమవారం రాత్రి నిలిచిపోయాయి. ఈ పంపులకు అందించే ముఖ్యమైన సర్వీసులో ఎస్ఎఫ్‌సీ (స్టాటికల్ ఫ్రీక్వెన్సీ కాంపోనెంట్)లో సమస్యల కారణంగా నీటిని ఎత్తిపోసే పంపులు ఆగిపోయాయి. ఈ సాంకేతిక సమస్యను బీహెచ్‌ఈఎల్ కంపెనీ వారు మాత్రమే పరిష్కరిస్తారని సమాచారం. కాగా, ఆ కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టుల కింద రూ.1.13 కోట్లు బాకీ పడింది. బీహెచ్‌ఈఎల్ కంపెనీ వారు మెయింటెన్స్ పనులకు గతంలోనే బిల్లులు చెల్లించకపోవడంతో ఈ సమస్యను పరిష్కరించేందుకు ముందుకు రావడం లేదని సమాచారం. కంపెనీ వారికి బిల్లులు చెల్లిస్తేనే సమస్య పరిష్కారం అవుతుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా జూరాల జలాశయం నుంచి సుమారు నాలుగు టీఎంసీల నీరు ఎత్తిపోశారు. రైతులు సైతం సాగు పనుల్లో బిజీగా ఉన్నారు. ఈ సమయంలో సాంకేతిక సమస్యతో పంపులను నిలిపి వేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్టు అధికారులతో 'ఆంధ్రజ్యోతి' మాట్లాడగా సాంకేతిక సమస్య ఉన్నమాట వాస్తవమేనని, ఒక్కో పంపు ద్వారా 750 క్యూసెక్కుల నీరు పంపింగ్ చేసే సమయంలోనే సమస్య తలెత్తిందని తెలిపారు. బీహెచ్‌ఈఎల్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించేందుకు త్వరలోనే చర్యలు చేపడతామని వారు తెలిపారు.

ఫ్యాన్సీ నంబరుకు రూ.5.45 లక్షలు

- మరో రూ.30 వేలు అదనం

మహబూబ్‌నగర్, ఆగస్టు 6: వాహనాలకు లక్కీ, ఫ్యాన్సీ నంబరు కావాలని చాలామంది ప్రయత్నాలు చేస్తుంటారు. చాలా మంది ఫ్యాన్సీనెంబరు తమ హోదాగా బావిస్తారు. కావాల్సిన నెంబరు దక్కించుకునేందుకు ఎంత ఖర్చుకైనా వెనకాడరు. పాలమూరు రవాణా శాఖలో మంగళవారం టీజీ06 6666 నెంబరును దక్కించుకునేందుకు తొమ్మిది మంది పోటీపడ్డారు. ముందుగానే ఈ నెంబరు కోసం ఒక్కొక్కరు రూ.30 వేలు చెల్లించి రిజర్వ్ చేసుకున్నారు. తొమ్మిది మంది పోటీ పడుతుండటంతో యాక్షన్ అనివార్యమైంది. ఆన్‌లైన్‌లోనే వాహనదారులు రేట్‌ను కోట్ చేస్తూ బిడ్డింగ్ చేశారు. ఇందులో అందరికన్నా ఎక్కువగా బాలకృష్ణకోలి అనే వ్యక్తి రూ.5.45 లక్షలకు బిడ్డింగ్ వేయడంతో ఆయనకు ఈ ఫ్యాన్సీ నెంబరు దక్కింది. జిల్లాకు చెందిన ఓ ప్రజాప్రతినిధి సైతం రూ.3.50 లక్షలు ఈ నెంబరు కోసం బిడ్డింగ్ చేసినట్లు తెలుస్తోంది. అయితే ఆన్‌లైన్‌లో బిడ్డింగ్ చేయడంతో అది ఏ కారు, అతనికి సంబంధించిన వివరాలు తెలియలేదు. వాహనం రిజిస్ట్రేషన్ సమయంలో ఈ వివరాలు బయటపడనున్నాయి.

ఉరి వేసుకొని డైరెక్టర్ ఆత్మహత్య

- తట్టుకోలేక తమ్ముడి మిస్సింగ్



జానకిరామ్ (ఫైల్)

గోపాల్‌పేట, ఆగస్టు 6 : ఉరి వేసుకొని ఓ డైరెక్టర్ ఆత్మహత్య చేసుకుంటే దాన్ని జీర్ణించుకోలేని ఆయన తమ్ముడు ఇంట్లో నుంచి వెళ్లిపోయిన ఘటన వనపర్తి జిల్లా గోపాల్ పేట మండల కేంద్రంలో చోటుచేసుకున్నది. ఈ ఘటనకు సంబంధించి గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గోపాల్‌పేటలోని హనుమాండ్ల కాలనీకి చెందిన రాములు, అనంతమ్మ దంపతులకు పెద్ద కుమారుడు కుమారి జానకిరామ్(44), చిన్నకుమారుడు బాలకృష్ణ ఉన్నారు. జానకిరామ్ 22 సంవత్సరాలుగా హైదరాబాద్‌లో సినీరంగంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు. 2022లో జీఎస్‌టీ సినిమాతో డైరెక్టర్‌గా పరిచయం అయ్యాడు. బాలకృష్ణ అమ్మానాన్నలతో కలిసి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఆర్థిక సమస్యలతో సోమవారం ఉదయం జానకిరామ్ కూకట్‌పల్లిలోని ఓ ఓయో హోటల్ రూంలో చేరాడు. సాయంత్రం అనుమానంతో హోటల్ సిబ్బంది రూంలోకి వెళ్లి చూడగా ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొని కనిపించాడు. విషయం తెలుసుకున్న తమ్ముడు బాలకృష్ణ ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసి ఎటో వెళ్లిపోయాడు. బాలకృష్ణ అదృశ్యం కావడంతో కాలనీ వాసులు వెతుకుతున్నారు. మంగళవారం పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి గ్రామస్థులకు అప్పగించారు.



విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

పెంట్లవెల్లి, ఆగస్టు 6 : విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించారు. పాఠశాలలో వంట గది, మంచినీళ్లు వచ్చే ప్రాంతాన్ని పరిశీలించా రు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్య క్రమంలో మాజీ సర్పంచు రాజేష్, ఎస్‌కె ఖాజా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతుల వెంకటేశ్వర్లు, నాయకులు సురేందర్‌గౌడ్, అబ్దుల్ హుస్సేన్, బ్రహ్మం పాల్గొన్నారు.


పెంట్లవెల్లి కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి



ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై కేసు నమోదు

జడ్చర్ల, ఆగస్టు 6 : జడ్చర్ల మండలం పోలేపల్లిలో నక్క సత్యనారాయణ (42) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని సత్యనారాయణ భార్య సవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపారు. ఇటీవల కాలంలో ఇంట్లో సమస్యలతో పాటు ఆర్థిక ఇబ్బందులతో క్షణికావేశంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈనెల 5న ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఫిర్యాదులో పేర్కొన్నట్లు వివరించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ పేర్కొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

నవాబ్‌పేట, ఆగస్టు 6 : అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ఓ టిప్పర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు. మండలంలోని కారుకొండ గ్రామ శివారులోని సామగడ్డతండా సమీపంలో ఉదండాపూర్ డ్యాం నుంచి ఓ టిప్పర్‌లో ఇసుకను తీసుకువస్తుండగా అక్కడే గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు టిప్పర్‌ను ఆపి తనిఖీ చేయగా అందులో ఇసుక ఉండడంతో పోలీసులను గమనించిన డ్రైవర్ బండి అక్కడే వదిలేసి పారిపోయాడు. టిప్పర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇన్‌స్టాల్‌మెంట్ పేరుతో మోసం

హన్వాడ, ఆగస్టు 6 : వాయిదా పద్ధతిలో టీవీలు, ఫ్రిజ్‌లు, బీరువాలు, కూలర్లతో పాటు మరి కొన్ని వస్తువులు ఇస్తామని చెప్పి ముందుగా అడ్వాన్స్ ఇవ్వాలని కొందరి దగ్గర డబ్బులు తీసుకొని దుండగులు పరారైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఓ బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... గత మూడు రోజుల క్రితం హన్వాడ గ్రామానికి టోగు రాథోడ్ అనే వ్యక్తి వచ్చాడు. మేము వాయిదా పద్ధతిలో టీవీలు, ఫ్రిజ్‌లు, బీరువాలు, కూలర్లు ఇస్తామని మాయ మాటలు చెప్పాడు. దీనికి కొందరు మోసపోయి రెండు, మూడు వేల రూపాయలు అడ్వాన్స్‌గా ఇచ్చారు. రేపు వస్తువులు తెస్తానని చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు. మూడు రోజులైనా సదరు వ్యక్తి వస్తువులు తీసుకరాక పోవడంతో పోలీసులకు మంగళవారం సమాచారం ఇచ్చారు. ఈ విషయంపై బాధితుడు సమాచారం ఇచ్చాడని, విచారణ చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రెవెన్యూ అధికారులపై చీటింగ్ కేసు

నవాబ్‌పేట, ఆగస్టు 6 : తమకు తెలియకుండా తమ భూమి ఇతరుల పేర పట్టా చేశారని ఆరోపిస్తూ సదరు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నవాబ్‌పేట రెవెన్యూ అధికారులపై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. ఎస్ఐ విక్రం వివరాల ప్రకారం... మండలంలోని చౌడూర్ గ్రామ శివారులోని సర్వేనెంబర్ 233/1లో 5 ఎకరాల 5 గుంటల పట్టాభూమి సుశీలబాయి అనే మహిళపై ఉండగా, 17.02.2024న రెవెన్యూ అధికారులు, ధరణి ఆపరేటర్ కలిసి ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్ చేశారని, వీరిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సుశీలబాయి కుమారులు పురుషోత్తంరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిపై అత్యాచారం కేసు నమోదు

మహమ్మదాబాద్, ఆగస్టు 6 : బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తిపై కేసు నమోదైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ శేఖర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఒక బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బలమైన రక్తగాయం చేసిన వ్యక్తి రిమాండ్


మహమ్మదాబాద్, ఆగస్టు 6 : బలమైన రక్తగాయం చేసిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించిన సంఘటన మహమ్మదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని పెద్ద తండా గ్రామంలో శేకపల్లి తండాకు చెందిన కాట్రావత్ అనిల్‌ను కట్టెతో విస్లావత్ సంతోష్ రాహుల్, మూతి బాయిలు డబ్బుల విషయంలో వారి మధ్య జరిగిన గొడవలో కట్టెలతో కొట్టుకున్నారు. కాట్రావత్ అనిల్‌కు బలమైన రక్త గాయాలు కావడంతో అతని తండ్రి కాట్రావత్ గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.






















సింథటిక్ అథ్లెటిక్స్‌కు అడుగులు పడేనా..?

- ఏర్పాటైతే అథ్లెట్లకు మెరుగైన శిక్షణకు అవకాశం
- ఇటీవల పీయూలో అందుబాటులోకి వచ్చిన అధునాతన ట్రాక్


స్టేడియంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటును పరిశీలిస్తున్న కేంద్ర కమిటీ సభ్యులు (ఫైల్)



పీయూలో ఏర్పాటు చేసిన సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 6 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం క్రీడా హబ్‌గా రూపాంతరం చెందుతోంది. జిల్లా కేంద్రంలోని మరోవైపు స్టేడియంలో అధునాతనమైన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణమై క్రీడాకారులకు ఇటీవల అందుబాటులోకి వచ్చింది. మైదానంలో ఆధునీకరణ పనులు చేపట్టి వాలీబాల్, ఖోఖో, లాంగ్‌జంప్, హైజంప్, బాస్కెట్‌బాల్ కోర్టులతో పాటు ఆర్చరీ జోన్ ఏర్పాటు చేశారు. మెయిన్ స్టేడియంలో అనేక క్రీడా సౌకర్యాలు ఉన్నప్పటికీ అథ్లెట్లు సాధన చేసుకునేందుకు సింథటిక్ ట్రాక్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మట్టితో ఏర్పాటు చేసిన ట్రాక్‌పైనే క్రీడాకారులు సాధన చేసుకుంటున్నారు. జిల్లా కేంద్రంలోని పీయూలో ఇటీవల అంతర్జాతీయ ప్రమాణాలతో సింథటిక్ ట్రాక్ రూ.10 కోట్ల వ్యయంతో నిర్మించారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి దీనిని ప్రారంభించారు. ప్రధాన స్టేడియంలో ట్రాక్ లేకపోవడం అథ్లెట్లను నిరాశకు గురి చేస్తున్నది.

స్టేడియంను పరిశీలించిన కేంద్ర సభ్యులు

ఖేలో ఇండియా పథకం కింద పలు జిల్లాల్లో అధునాతనమైన సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్‌లు ఏర్పాటవుతున్నాయి. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్, మెదక్ జిల్లాల్లో సింథటిక్ ట్రాక్‌లు ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాకే తలమానికమైన మహబూబ్‌నగర్ జిల్లాలో జిల్లా యువజన క్రీడాశాఖ ఆధ్వర్యంలోని ప్రధాన స్టేడియంలో సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ ఏర్పాటుకు గతంలో ప్రణాళికలు రూపొందించారు. ఖేలో ఇండియా పథకం కింద మెయిన్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు కోసం ముందుగా జిల్లా క్రీడా శాఖ ద్వారా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్)కు ప్రతిపాదనలు పంపారు.

మెయిన్ స్టేడియంలో 400మీటర్ల ఎనిమిది లైన్ల సింథటిక్ ట్రాక్ ప్రతిపాదనలకు సంబంధించి 2021 అక్టోబరు 22న ఖేలో ఇండియా కేంద్ర పరిశీలన కమిటీ సభ్యులు పరిశీలించారు. స్టేడియం అంతా తిరిగి సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు సంబంధించి ఫీజుబిలిటీ వివరాలు సేకరించారు. మెయిన్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు కేవలం ప్రతిపాదనలకే పరిమితమైందనే విమర్శలు ఉన్నాయి.

ఔత్సాహిక క్రీడాకారులకు వరం

జిల్లా కేంద్రంలోని ప్రధాన స్టేడియంలో సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ ఏర్పాటైతే ఔత్సాహిక క్రీడాకారులకు ఎన్నో మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయి. సింథటిక్ ట్రాక్‌లో అంతర్జాతీయ స్థాయిలో సౌకర్యాలు ఉంటాయి. ట్రాక్ ఏర్పాటు మెయిన్ స్టేడియంకు గుర్తింపుతో పాటు సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్‌తో జాతీయ స్థాయి పోటీలు జరిగే అవకాశం ఉంటుంది. జిల్లాకు చెందిన అథ్లెటిక్స్ క్రీడాకారులకు హైదరాబాద్ కాకుండా ఇక్కడి సింథటిక్ ట్రాక్‌లో రెగ్యులర్‌గా ప్రాక్టీస్ చేసే అవకాశం లభిస్తుంది.

శాట్‌కు ప్రతిపాదనలు పంపించాం



ప్రధాన స్టేడియంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు కోసం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణకు ప్రతిపాదనలు పంపించాం. అదే విధంగా మరో సారి శాట్ ద్వారా ఖేలో ఇండియాకు ప్రతి పాదనలు పంపించేలా తగిన చర్యలు తీసుకుంటున్నారు. సింథటిక్ ట్రాక్ వస్తే జిల్లాలో అథ్లెటిక్స్ క్రీడాకారులకు మెరుగైన శిక్షణకు అవకాశం ఉంటుంది. అలాగే ఇక్కడి మైదానంలో అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీలు నిర్వహించుకునేందుకు అవకాశా లుంటాయి. మరోసారి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి ఇందుకు ప్రయత్నిస్తా.

- ఎస్. శ్రీనివాస్, డీవైఎస్‌వో, మహబూబ్‌నగర్

సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేయాలి



ప్రధాన స్టేడియంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేయాలి. ఇప్పటికే స్టేడియంలో ఎన్నో క్రీడ వసతులు ఉన్నాయి. ముఖ్యంగా అథ్లెట్ల కోసం సింథటిక్ ట్రాక్ వస్తే మెరుగైన శిక్షణకు అవకాశం ఉంటుంది. ఇక్కడ సింథటిక్ ట్రాక్ లేకపోవటంతో చాలా మంది జిల్లా అథ్లెట్లు హైదరాబాద్‌లో ప్రాక్టీస్ చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి ట్రాక్ ఏర్పాటుకు కృషి చేయాలి.

- జి. శరత్‌చంద్ర, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, మహబూబ్‌నగర్

హెచ్‌సీఏ త్రీడే
లీగ్ మ్యాచ్‌లో రాణించిన అరుణ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 6: హెచ్‌సీఏ త్రీడే లీగ్ టోర్నీ మూడో మ్యాచ్‌లో జిల్లా బౌలర్ అరుణ్‌కుమార్ నాలుగు వికెట్లు తీసి రాణించాడు. మంగళవారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలోని మైదానం గ్రౌండ్-1లో ఆట మొదటి రోజు కల్ప జట్టు టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసి 86 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 351 పరుగులు చేసింది. జట్టులో అర్షిత్ అర్ధ సెంచరీ(50), చిరగ్ యాదవ్ 182 పరుగులు (సెంచరీ), విశాల్ అర్ధసెంచరీ (50) చేశారు. జిల్లా బౌలర్‌లో మరో మారు నాలుగు వికెట్లు తీసి రాణించగా, శ్రీకాంత్, షాదాబ్‌అహ్మద్ చెరో వికెట్ తీశారు. నాలుగు వికెట్లు తీసిన అరుణ్‌ను జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి పట్ల రాజశేఖర్ అభినందించారు.

కాటవరంలో వ్యక్తి దారుణ హత్య

అడ్డాకుల, ఆగస్టు 6 : మండలంలోని కాటవరం గ్రామంలో మంగళవారం ఉదయం ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. అడ్డాకుల ఎస్‌ఐ శ్రీనివాసులు కథనం ప్రకారం.. పల్లెం కొల్లంపల్లి (40) అనే వ్యక్తి పొలం దగ్గర వ్యవసాయ పనులు చేసుకుంటుండగా అదే గ్రామానికి చెందిన మన్యంకొండ అనే వ్యక్తి అతని బంధువులతో కలిసి కర్రలతో దాడి చేశాడు. కొన ఊపిరితో ఉన్న కొల్లంపల్లిని గమనించిన గ్రామస్థులు మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలి స్తుండగా మార్గమధ్యలో చనిపోయినట్లు తెలిపారు. మన్యంకొండ, అతనికి సహ కరించిన బంధువులపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. హత్యకు కారణాలపై విచారణ చేస్తున్నామని తెలిపారు.

భవానీ సాగర్ వద్ద
గుర్తు తెలియని మృత దేహం

కోయిలకొండ, ఆగస్టు 6 : మండలంలోని జై భవాని సాగర్ వద్ద 30 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం మంగళవారం లభ్యమైందని ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. రెండు మూడు రోజుల క్రితం మృతి చెంది ఉన్నట్లు అక్కడి ఆనవాళ్లనుబట్టి తెలుస్తోందని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతి చెందిన వ్యక్తికి సంబంధించిన బంధువులు కోయిలకొండ పోలీసులను సంప్రదించాలని ఎస్‌ఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సులో వృద్ధురాలి మృతి

మిడ్జిల్, ఆగస్టు 6 : నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మనపల్లి గ్రామానికి చెందిన లక్ష్మమ్మ(63) ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ బోయిన్‌పల్లి స్టేజీ వద్ద మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. కల్వకుర్తి వైపు నుంచి మహబూబ్‌నగర్ వెళ్లే ఆర్టీసీ బస్సులో నాగర్‌కర్నూల్ జిల్లా రేవల్లి బస్‌స్టేజీ వద్ద లక్ష్మమ్మ బస్సు ఎక్కినట్లు ప్రయాణికులు తెలిపారు. బస్సు బోయిన్‌పల్లికి రాగానే తనకు చలివేస్తుందని లక్ష్మమ్మ తోటి ప్రయాణికులతో చెప్పడంతో ప్రయాణికులు చూస్తుండగానే ఎక్కిళ్లు వేస్తూ బస్సులోనే ప్రాణాలు వదిలినట్లు తెలిపారు. ఆమె వద్ద ఉన్న ఆధార్ కారులోని ఫోన్ నంబర్‌కు ఫోన్ చేసి, ఆమె కుమారుడికి విషయం చెప్పగా, వారు వచ్చి ప్రైవేటు వాహనంలో తల్లి మృతదేహాన్ని తీసుకెళ్లినట్లు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మూసాపేట, ఆగస్టు 6 : మండల పరిధిలోని వేముల గ్రామంలో ఉంద్యాల శేఖర్‌రెడ్డి ఇంట్లో చోరీ జరిగింది. మూసాపేట ఎస్‌ఐ శ్రీనివాసులు కథనం ప్రకారం... శేఖర్‌రెడ్డి హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తుంటాడు. ఆయన తల్లిదండ్రులు ఊర్లోనే ఉండేవారు. గత నెల 25వ తేదీన అనారోగ్యం రీత్యా ఆసుపత్రిలో చూయించుకునేందుకు ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లో ఉన్న కుమారుడి దగ్గరకు వెళ్లారు. ఇదిలా ఉంటే శనివారం ఉదయం ఆ ఇంటి తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించిన ఇంటి ముందు ఉండే శ్రీకాంత్, శేఖర్‌రెడ్డికి సమాచారం అందించాడు. వేములకు చేరుకున్న శేఖర్‌రెడ్డి ఇంట్లోకి వెళ్లి చూడగా దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించడంతో జిల్లా కేంద్రం నుంచి క్లూసు టీంను రప్పించి ఇంటిలో ఉన్న బీరువాను పరిశీలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

హాస్టల్ విద్యార్థి అదృశ్యం

నవాబ్‌పేట, ఆగస్టు 6 : గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థి అదృశ్యమైన సంఘటన మండలంలోని కొత్తపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ విక్రమ్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం వత్తుగండ్ల తండాకు చెందిన సభావత్ నితిన్, వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం కొత్తపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్నాడు. వారం రోజుల క్రితం ఇంటి నుంచి హాస్టల్‌కు వచ్చి ఈ నెల నాలుగున హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేదని తల్లిదండ్రులకు ఫోన్ చేయడంతో తల్లిదండ్రులు 5వ తేదీన హాస్టల్‌కు వచ్చి మంచిగా చదువుకోవాలని సర్దిచెప్పి వెళ్లారు. సాయంత్రం నితిన్ హాస్టల్ నుంచి బయటకు వెళ్లి ఎంతకూ తిరిగిరాకపోవడంతో ఆశ్రమ పాఠశాల వార్డెన్ బాలచందర్, విద్యార్థి తండ్రి దేవేందర్ నాయక్‌కు ఫోన్ చేసి తెలిపాడు. దేవేందర్ నాయక్ బంధువుల ఊర్లలో ఆచూకీ కోసం ప్రయత్నం చేసినా ఎక్కడా లభించలేదు. దీంతో మంగళారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేటి నుంచి తెలంగాణ
క్లస్టర్ స్థాయి క్రీడా సమ్మేళనం

బిజినేపల్లి, ఆగస్టు 6 : నాగర్ కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో బుధ, గురువారం రెండు రోజుల పాటు తెలంగాణ క్లస్టర్ స్థాయి క్రీడా సమ్మేళనం నిర్వహించనున్నట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ పి.భాస్కర్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జవహర్ నవోదయ విద్యాలయా లకు చెందిన క్రీడాకారులంతా పాల్గొంటారని అన్నారు. క్రీడా సమ్మేళనంలో భాగంగా వాలీబాల్, బాస్కెట్ బాల్, హ్యాండ్‌బాల్ తదితర క్రీడా పోటీలు నిర్వహించి వివిధ క్యాటగిరిల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ప్రతిభావంతులను రీజనల్ స్థాయికి ఎంపిక చేసి పంపనున్నట్లు తెలిపారు. బుధవారం క్రీడా పోటీల ప్రారంభ వేడుకలకు కలెక్టర్ బదావత్ సంతోష్, జిల్లా విద్యాశాఖ అధికారులు హాజరవ్వనున్నట్లు పేర్కొన్నారు.

ఉద్యోగ భద్రత కోసం ఎదురుచూపు

- సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు విద్యాశాఖలో విలీనమయ్యేనా.?!
- తక్కువ వేతనంతో భారంగా కుటుంబ పోషణ
- సెలవుల్లోనూ విధుల నిర్వహణ


వనపర్తి జిల్లా కేంద్రంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మె (ఫైల్)

ఖిల్లాఘణపురం, ఆగస్టు 6 : విద్యాశాఖకు అనుబంధంగా విధులు నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు తరచుగా నిరసనలు తెలుపుతూ ఉద్యోగ భద్రత కోసం ఎదురు చూస్తున్నారు. విద్యాశాఖలో విధులు నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఒప్పంద ఉద్యోగులు ఆశానిరాశల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. గత 19ఏళ్ల నుంచి విడుతల వారీగా సర్వశిక్ష అభియాన్‌లో భాగంగా ప్రభుత్వ లోకల్ బాడీ ఉపాధ్యాయుల లాగే జిల్లా విద్యాశాఖ అధికారి పరిధిలో రోస్టర్ మెరిట్ రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఇంటర్వ్యూల ఆధారంగా నియామకం అవుతూ వారి పర్యవేక్షణలోనే విధులు నిర్వహిస్తున్నారు. 2005-06లో కేజీబీవీ పాఠశాలలో ప్రారంభం కాగా 2009లో విడతల వారీగా ఒప్పంద ఉద్యోగులుగా నియామకాలు జరిపారు. ప్రభుత్వం సరైన ప్రోత్సాహం అందించడం లేదని ఆరోపణలు ఉన్నాయి. విద్యాశాఖలో భాగమైన సమగ్ర శిక్ష అభియాన్‌లో వనపర్తి జిల్లాలో 520 మంది కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారు. డిస్ట్రిక్ ప్రాజెక్టు ఆఫీస్ సిబ్బంది ఆరుగురు అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ సిబ్బంది 13 మంది, కేజీబీవీ పాఠశాల సిబ్బంది 321, ఎమ్మార్సీ సిబ్బంది 69, క్లస్టర్, స్కూల్ పరిధిలోని సిబ్బంది 111, సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా ఉద్యోగులు మొత్తం 520 మంది ఉన్నారు. గత 19 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న వీరికి కనీస వేతన చట్టం ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశాలున్నాయి. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు సరైన వేతనం ఇవ్వకపోయినా ప్రభుత్వ ఉద్యోగులకు సమానంగా విధులు నిర్వహిస్తున్నారు.

విద్యా వ్యవస్థకు వెన్నెముకగా ..

జిల్లాస్థాయి సమాచారాన్ని ప్రాథమిక స్థాయిలో చేరవేయడానికి క్షేత్రస్థాయిలో విద్యాశాఖ దస్త్రాలను సేకరించడానికి సర్వశిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న సీఆర్‌పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మెసెంజర్లు, డిస్ట్రిక్ ప్రాజెక్టు ఆఫీస్ సిబ్బంది సెలవుల దినాల్లోను సైతం విధులు నిర్వహిస్తున్నారు. బాలికల విద్య అంటే కేజీబీవీలు అనే విధంగా ప్రతిభావంతమైన విద్యార్థులను తీర్చిదిద్దుతూ ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో ఫలితాల కంటే మెరుగ్గా ఫలితాలు అందిస్తు బాలికల విద్యకు బంగారు బాటలు వేస్తున్నారు. భవిత కేంద్రాల్లో ప్రత్యేక ఉపాధ్యాయులు (ఐఈఆర్‌పీలు) మానసిక దివ్యాంగుల్లో విద్యా ప్రమాణాలు పెంచుతున్నారు. అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్ పరిధిలో కాంట్రాక్టు టీచర్స్, పాఠశాల స్థాయిలో పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు, పీఈటీలు, టైలరింగ్, ఆర్ట్, క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్లు విధులు నిర్వహిస్తు విద్యా వ్యవస్థకు వెన్నెముకగా సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు పని చేస్తున్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి



ప్రభుత్వం సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అందించాలి. ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేసి ఉద్యోగ భద్రత కల్పించి విద్యాశాఖలో విలీనం చేయాలి. ప్రభుత్వం ఉద్యోగులతో సమానంగా ఆరోగ్య, ప్రమాద బీమా సౌకర్యం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలి.

- అబ్దుల్ ఖదీర్, సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు

సమగ్ర శిక్ష ఉద్యోగుల జీవనంలో మార్పు లేదు



ప్రభుత్వాలు మారినా మా జీవన విధానాల్లో మార్పు రాలేదు. ఒప్పంద ఉద్యోగులుగా విధులు నిర్వహించడంతో విద్యాశాఖలో వెట్టిచాకిరీ తప్పడం లేదు. ఉన్నతాధికారుల అత్యవసర సమాచార సేకరణ కోసం సెలవు దినాల్లో సైతం పని చేస్తున్నాం. మినిమం టైం స్కేల్ ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది.

- తిరుపతయ్య, ఎంఐఎస్ కోఆర్డినేటర్ల జిల్లా అధ్యక్షుడు, వనపర్తి

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య


ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న వీరేష్

మూసాపేట, ఆగస్టు 6 : మండల పరిధిలోని దాసరిపల్లి గ్రామ శివారులో గల మాల గట్ట సమీపంలోని అలకుంట నర్సింములు వ్యవసాయ పొలంలో మంగళవారం అడ్డాకుల మండలం పొన్నకల్ గ్రామానికి చెందిన ద్యావరి వీరేష్ (30) అనే యువకుడు కుటుంబ కలహాలతో చింత చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ద్యావరి వీరేష్‌కు గతంలో గాజులపేట గ్రామానికి చెందిన పుష్పలతతో మొదటి వివాహం జరిగింది. కొంత కాలానికి వారిరువురి మధ్య కుటుంబ కలహాలు ఏర్పడడంతో కోర్టు ద్వారా విడాకులు తీసుకున్నాడు. 2016లో పెద్దల సమక్షంలో పొన్నకల్ గ్రామంలోనే సంధ్యను వీరేష్ రెండవ వివాహం చేసుకున్నాడు. వారికి ఓ కూతురు, కుమారుడు ఉన్నారు. ఇదిలా ఉండగా మొదటి భార్య పుష్పలత రెండు నెలల క్రితం పొన్నకల్ గ్రామానికి చేరుకొని వీరేష్ ఇంటిలోనే ఉంటున్నది. అప్పటి నుంచి రోజూ పుష్పలత వీరేష్‌తో గొడవ పడేదని, దీంతో వీరేష్, మొదటి భార్య పుష్పలత ఇద్దరూ కలిసి ఇంటి నుంచి సోమవారం ఉదయం 11 గంటలకు వెళ్లారు. అప్పటి నుంచి రెండవ భార్య సంధ్య కుటుంబ సభ్యులతో ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం దాసరిపల్లి శివారులో చింత చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని దాసరిపల్లి గ్రామంలో ఉన్న బంధువులు ఫోన్ ద్వారా సంధ్యకు సమాచారం ఇవ్వడంతో ఆమె అక్కడికి వచ్చి చూడగా చనిపోయిందని తన భర్త వీరేష్ అని గుర్తు పట్టింది. మొదటి భార్య గొడవలతోనే తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని ఆమె ఆరోపించారు. ఈ మేరకు శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించి వీరేష్ రెండవ భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

బాలింత మృతి

- వైద్యుల నిర్లక్ష్యమేనంటూ బంధువుల ఆరోపణ
- ప్రైవేట్ ఆసుపత్రి ముందు ఆందోళన, రాస్తారోకో


ఆసుపత్రి ముందు రోడ్డుపై బైఠాయించిన మృతురాలి బంధువులు

నాగర్‌కర్నూల్ క్రైం, ఆగస్టు 6 : నాగర్‌కర్నూల్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో బాలింత మృతి చెందింది. ఆస్పత్రి నిర్వాహకుల నిర్లక్ష్యంతో బాలింత మృతి చెందిందని మంగళవారం ఆస్పత్రి ముందు బాధితకుటుంబ సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు ఆందోళన చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని హౌసింగ్‌బోర్డులో నివాసం ఉంటున్న సాయిశ్వర్ తన కూతురు కావ్యను ప్రసవం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. వైద్యులు కావ్యకు కాన్పు చేయడంతో మగ శిశువుకు జన్మించాడు. శిశువు క్షేమంగా ఉన్నప్పటికీ బాలింత ఆరోగ్యం విషమించడంతో ఆస్పత్రి నిర్వాహకులు స్వయంగా అంబులెన్స్ ఏర్పాటు చేసి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి దాదాపు నాలుగు గంటల ముందే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో బాలింత మరణానికి గల కారణాలను తెలుసుకునేందుకు బంధువులు స్థానిక ఆస్పత్రి డాక్టర్ సునీల్‌ను సంప్రదించగా ఎలాంటి సమాధానం చెప్పకుండా ఆసుపత్రి నుంచి వెళ్లిపోయారు. బాధితకుటుంబ సభ్యులు ఆసుపత్రి ముందు బైఠాయించి ఆందోళన చేశారు. వారికి మద్దతుగా ప్రజా సంఘాలు రాజకీయాలకతీతంగా ఆందోళన చేశారు. బాలింత మృతికి కారణమైన ఆస్పత్రి వైద్యులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రి తనిఖీ కోసం డిప్యూటీ డీఎంహెచ్‌వో వెంకటదాస్, వైద్య సిబ్బంది ఆసుపత్రిని పరిశీలించి రికార్డులను స్వాధీనపర్చుకున్నారు. రాస్తారోకో చేస్తున్న వారికి ఎస్‌ఐ గోవర్ధన్ నచ్చజెప్పినా వినకపోవడంతో ఎస్‌ఐ వెనుదిరిగారు. సంఘటన స్థలానికి సీఐ కనకయ్య చేరుకొని ఆందోళన కారులతో మాట్లాడారు. కావ్య మృతికి కారకులైన డాక్టర్‌ను అరెస్టు చేసేవరకు ఆందోళన విరమించమని చెప్పడంతో బంధువులతో, ప్రజా సంఘాలతో సీఐ, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు మాట్లాడి సాయంత్రంలోగా ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో మృతురాలి బంధువుల, ప్రజా సంఘాలు ఆందోళన విరమించారు.

పెంట్లవెల్లి కేజీబీవీ ప్రత్యేక అధికారి, వంట సిబ్బందిపై వేటు

పెంట్లవెల్లి, ఆగస్టు 6: నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి కేజీబీవీ బాలికల విద్యాలయంలో రెండు రోజులుగా విద్యార్థినుల అస్వస్థత ఘటనకు బాధ్యులైన ప్రత్యేక అధికారి, వంట సిబ్బందిపై కలెక్టర్ బదావత్ సంతోష్ చర్యలు తీసుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేకాధికారి ఎం. స్వప్న, వంట సిబ్బంది కృష్ణమ్మ, రాణి, రాధమ్మ, అలివేలును కాంట్రాక్టు ఉద్యోగం నుంచి తొలగిస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. కేజీబీవీలో హిందీ సీఆర్‌టీగా పని చేస్తున్న సలహేబేగంకు ప్రత్యేక అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని వివిధ రకాల గురుకులాలు, కేజీబీవీల్లో పని చేసిన సిబ్బంది, విధి నిర్వహణల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఉత్తర్వులో పేర్కొన్నారు.

జానంపేటలో భారీ మొసలి పట్టివేత

శ్రీరంగాపురం, ఆగస్టు 6 : వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండలం జానంపేట గ్రామంలో ఓ భారీ మొసలిని అటవీ అధికారులు గ్రామస్థులతో కలిసి పట్టుకున్నారు. పట్టుకున్న మొసలిని కృష్ణానదిలో వదిలిపెట్టారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నాగన్నకు అర్ధరాత్రి రెండు గంటల సమయంలో కుక్కలు అరవడంతో మెలకువ వచ్చింది. బయటికి వచ్చి చూసిన అతనికి ఓ భారీ మొసలి కన్పించింది. ఖంగు తిన్న ఆయన వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలానికి కానిస్టేబుల్ రామకృష్ణ బృందం చేరుకుని నాగన్నకు ధైర్యం చెప్పి వనపర్తి పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న స్నేక్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణసాగర్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన వెంటనే తన బృందంతో గ్రామానికి చేరుకొని నాలుగు గంటల పాటు శ్రమించి భారీ మొసలిని బంధించారు. అనంతరం మొసలిని ట్రాక్టర్‌పై తీసుకెళ్లి కృష్ణానదిలో వదిలినట్లు పెబ్బేరు మండల ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ రాణి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి గోపాల్, దేవేంద్రం, అవినాష్ తదితరులున్నారు.

సూగూరులో మొసళ్ల సంచారం

మండల పరిధిలోని సూగూరు గ్రామంలో మొసళ్లు సంచరిస్తూ గొర్రెలను, మేకలను, పశువులను తింటున్నాయని కాపరులు తెలిపారు. నల్లచెరువు వెనుక భాగంలో రవీందర్‌గౌడ్‌కు చెందిన వ్యవసాయ బావితో పాటు, పెద్దకత్వ, చిన్నకత్వలో మొసళ్లు సంచరిస్తూ మేకలు, పశువులపై దాడి చేస్తూ తింటున్నాయని యజమానులు వాపోయారు. విషయాన్ని జిల్లా ఫారెస్టు అధికారులకు వివరించినా వారు పట్టించుకోవడం లేదని వారు పేర్కొన్నారు.

తరగతి గదిలో నిద్రపోయిన విద్యార్థి

- సాయంత్రం తాళం వేసి వెళ్లిపోయిన సిబ్బంది

ఉండవల్లి, ఆగస్టు 6 : తరగతి గదిలో ఓ విద్యార్థి నిద్రపోయాడు. అతడిని గమనించని సిబ్బంది సాయంత్రం తాళం వేసి వెళ్లిపోయారు. ఈ సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి ప్రాథమిక పాఠశాలలో జరిగింది. గ్రామానికి చెందిన నరసింహ కుమారుడు రోహిత్ ఉండవల్లి ప్రాథమిక పాఠశాలలో రెండవ తరగతి చదువుతున్నాడు. మంగళవారం పాఠశాలకు వెళ్లిన బాలుడు తరగతి గదిలోనే నిద్రపోయాడు. ఈ విషయాన్ని గమనించిన సిబ్బంది సాయంత్రం గదికి తాళం వేసి వెళ్లిపోయారు. ఆ తర్వాత కొద్దిసేపటిక మేల్కొన్న ఉదయ్ ఏడుస్తుండటంతో చుట్టుపక్కల వారు విని అక్కడికి చేరుకున్నారు. తాళం పగులగొట్టి విద్యార్థిని తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ విషయంపై ప్రధానోపాధ్యాయుడు మునిస్వామి, ఎంఈఓ శివ ప్రసాద్‌లను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా పొరపాటు జరిగిందని తెలిపారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా చూసుకుంటామని చెప్పారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


నర్సింహులు(ఫైల్)

కేటీదొడ్డి, ఆగస్టు 6 : విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతి చెందాడు. జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలోని యర్సన్‌దొడ్డి గ్రామంలో మంగళవారం ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యర్సన్‌దొడ్డి గ్రామానికి చెందిన కుర్వ బుడ్డన్న అలియాస్ నర్సింహులు (59) పొలంలో వరి నాటు వేసేందుకు కరిగెట సిద్ధం చేస్తున్నారు. ఈ సందర్భంగా కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగను కర్రతో పైకి లేపుతుండగా, తీగ జారి చేతిపై పడటంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య జయమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారుడు శివకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

చమన్‌ఖాన్‌దొడ్డి గ్రామానికి మళ్లీ నోటీసులు


గ్రామాన్ని ఖాళీ చెయించొద్దని అధికారులకు మొక్కుతున్న గ్రామస్థులు

గట్టు, ఆగస్టు 6 : జోగుళాంబ గద్వాల జిల్లా, గట్టు మండలం చమన్‌ఖాన్‌దొడ్డి గ్రామానికి మంగళవారం మళ్లీ కోర్టు అధికారులు, పోలీసులు నోటీసులతో వెళ్లడంతో గ్రామస్థులు ఆందోళన చెందారు. గ్రామం మొత్తం తమదని, ఖాళీ చేయాలని గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు గతంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అప్పుడు కోర్టు నోటీసులు జారీ చేయగా, గ్రామాన్ని ఖాళీ చేసేది లేదని స్థానికులు స్పష్టం చేయడంతో అప్పటినుంచి వివాదం కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో మంగళవారం మరో మారు అధికారులు, పోలీసులు నోటీసులతో గ్రామానికి వెళ్లి స్థానికులతో మాట్లాడారు. ఎన్నో ఏళ్లగా, తాతల కాలం నుంచి తాము ఇక్కడే నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నామని, ఇప్పుడు తమను ఖాళీ చేయాలని చెప్పడం ఎంత వరకు న్యాయమని వారు అధికారులను ప్రశ్నించారు. గ్రామాన్ని ఖాళీ చేసేది లేదని తేల్చి చెప్పారు. దీంతో అధికారులు నోటీసులు ఇవ్వకుండానే వెనుదిరిగారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ కేటీ మల్లేశ్ సిబ్బందితో గ్రామంలో పర్యటించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ రద్దు

- నిరాశగా వెనుదిరిగిన మహిళలు


రైతువేదిక వద్ద నుంచి ఇంటికి వెళ్తున్న కల్యాణ లక్ష్మి చెక్కుల లబ్ధిదారులు

రాజోలి, ఆగస్టు 6 : కల్యాణలక్ష్మి చెక్కులు తీసునేందుకు వచ్చిన మహిళలు పంపిణీ కార్యక్రమం రద్దు కావడంతో నిరాశగా వెనుదిరిగారు. మండల కేంద్రమైన రాజోలి రైతు వేదికలో మంగళవారం కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు ముఖ్య అతిథిగా హాజరుకావలి ఉన్నది. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందని, లబ్ధిదారులందరూ రావాలని తహసీల్దార్ హరికృష్ణ తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 98 మంది లబ్ధిదారులైన మహిళలు రైతువేదిక వద్దకు చేరుకున్నారు. ఎమ్మెల్యే వస్తున్నారంటూ మధ్యాహ్నం వరకు అధికారులు వారిని అక్కడే కూర్చోబెట్టారు. అయితే తుమ్మిళ్ల లిఫ్ట్ మోటార్లు ఆన్ చేయడంలో వివాదం నెలకొనడంతో మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఎమ్మెల్యే విజయుడిని పోలీసులు అరెస్టు చేశారు. దీంతో చెక్కుల పంపిణీ రద్దు అయినట్లు అధికారులు చెప్పడంతో, అప్పటివరకు ఆకలితో ఎదురుచూసిన మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, నిరాశగా వెనుదిరిగి వెళ్లిపోయారు.

తహసీల్దారు కార్యాలయానికి తాళం

బిజినేపల్లి, ఆగస్టు 6 : పదకొండు గంటలైన తహసీల్దారు కార్యాలయానికి తాళాలు తీయకపోవడంతో వివిధ భూసమస్యలతో వచ్చిన ప్రజలు, కార్యాలయ సిబ్బంది తాళం ఎవరు వేశారని ఆందోళన చెందారు. మంగళవారం ఉదయం రోజులాగే తహసీల్దారు కార్యాలయ సిబ్బంది విధులకు హాజరయ్యేందుకు కార్యాలయానికి రాగా తాళాలు వేసి ఉండడంతో కిందిస్థాయి సిబ్బందిని ఆరా తీశారు. ఎవరు తాళాలు వేశారో తెలియకపోవడంతో సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. దాంతో వారు రాగా, సిబ్బంది ఆఫీసు తాళాలు పగుల కొట్టారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని లట్టుపల్లి గ్రామానికి చెందిన బాధితుల తండ్రి పేరు మీద ఉన్న పట్టా భూమిని స్వంత అన్న అక్రమంగా పట్టా చేసుకున్నట్లు తెలిసి తమకు న్యాయం చేయాలని కొంత కాలంగా తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఎన్నిసార్లు వచ్చిన ఇప్పుడు అప్పుడు అంటూ కాలయాపన చేస్తున్నారే తప్పా సమస్యను పరిష్కరించడం లేదని నిరసన వ్యక్తం చేసేందుకు తాళం వేసి ఉండవచ్చని తెలిపారు. ఈ విషయమై తహసీల్దార్ శ్రీరాములు వివరణ కోరగా విచారించిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అయితే తహసీల్దారు కార్యాలయానికి తాళం వేసింది ఎవరనేది తెలియాల్సి ఉంది.

చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

తాడూరు, ఆగస్టు 6 : ప్రస్తుత పరిస్థితులకనుగుణంగా అన్నదాతలందరూ చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలని పాలెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శశిభూషణ్ సూచించారు. మంగళవారం మండలంలోని ఇంద్రకల్ గ్రామంలో రైతు వేదికలో రైతులకు చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాలెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు మాట్లాడుతూ సమాజంలో చిరుధాన్యాల కొరత ఎక్కువగా ఉన్నందున రైతులు వాటిపై దృష్టి సారించి ఎక్కువ విస్తీర్ణంలో జొన్నలు, రాగులు, సజ్జలు, మినుములు, పెసర్లు, కందులు, బెబ్బర్లు, శనగలు, గోధుమలు వంటి వాటిని ఎక్కువ మొత్తంలో దిగుబడి సాధించే విధంగా చూడాలన్నారు. అనంతరం రైతులకు మూడు కేజీల విత్తనాలు కలిగిన జొన్నల బ్యాగులను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మహేశ్వరమ్మ, విజయలక్ష్మీ, శంకర్, వ్యవసాయ శాఖ మండల అధికారి సాయిరమేష్, ఏఈవోలు శివప్రసాద్, గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.

ఇంట్లోనే తడి, పొడి చెత్తను వేరు చేయాలి

కల్వకుర్తిటౌన్, ఆగస్టు 6 : ప్రతీ ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేరు చేయాలని మునిసిపల్ సిబ్బంది సూచించారు. మంగళవారం పట్టణంలోని బలరాంనగర్ కాలనీలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ ఇంటో ప్రోగైన చెత్తను ఎవరికి వారు మూడురకాలుగా విభజించి మునిసిపల్ సిబ్బందికి అందజేయాలని సూచించారు. కాలనీల్లో ఎక్కడపడితే అక్కడ చెత్తను వేయకూడదని, దోమలు, ఈగలు దుర్వాసనలు లేకుండా ఉండాలంటే ప్రతీ ఒక్కరు బాధ్యతగా చెత్తను వేయాలని వివరించారు. కార్యక్రమంలో మునిసిపల్ సిబ్బంది యాదగిరి, అంగన్‌వాడీ కార్యకర్త సుజాత, కాలనీవాసులు శేఖర్, సైదులు, మహమూద్, అనూష, చంద్రయ్య, రుక్మిణి, పరశురాములు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే చర్యలు

లింగాల, ఆగస్టు 6 : వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే చర్యలు తప్పవని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫిరంగి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అబ్బాయిపల్లి, క్యాంపు రాయవరం, గిరిజన ఆశ్రమ పాఠశాలలను, మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర వసతి గృహం, గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలను డీటీడీవో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వసతి గృహాల పరిసరాలు, అపరిశుభ్రంగా ఉండడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలికల ఆశ్రమ పాఠశాలలో ప్రార్థన సమయానికి డీటీడీవో హాజరై విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ వసతి గృహాల్లో విద్యార్థులతో మూడు కమిటీలను హెల్త్, శానిటేషన్, ఫుడ్ కమిటీలను తప్పనిసరిగా ఏర్పాటు చేయించాలని సూచించారు. ప్రతీ వసతి గృహంలో ఎఫ్ఆర్ఎస్‌ను పాటించాలని తెలిపారు. విద్యార్థుల పట్ల ఎలాంటి నిర్లక్ష్యం వహించిన సహించేది లేదని అన్నారు. ఆయన వెంట ఏపీఎం తిరుపతయ్య, వార్డెన్లు బాలస్వామి, తిరుపతయ్య, మంగమ్మ, శ్రీనివాసులు ఉన్నారు.

పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ

-ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ మల్లారెడ్డి



మొక్క నాటి నీరు పోస్తున్న ఏడీఆర్ డాక్టర్ మల్లారెడ్డి

బిజినేపల్లి, ఆగస్టు 6 : పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని ప్రొఫెసర్ జయశంకర్ దక్షిణ తెలంగాణ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ఏఆర్ఎస్) సహాయ పరిశోధన సంచాలకులు (ఏడీఆర్) డాక్టర్ మల్లారెడ్డి అన్నారు. మండలంలోని పాలెంలో ని కృషి విజ్ఞాన కేంద్రం ఆవరణలో మంగళవారం వన మహోత్సవం కార్యాక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి, జిల్లా భూగర్భ జల శాఖ అధికారి రమాదేవి, ఎంపీడీవో కతలప్ప గౌడ్, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ ఆదిశంకర్, ప్రవీణ్, ఏపీఓ మల్లికార్జున్, ఫీల్డ్ అసిస్టెంట్ కె.రాములు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కొడీ పీర్ల ఉత్సవాలు

తిమ్మాజిపేట, ఆగస్టు 6 : తిమ్మాజిపేట మండల పరిధిలోని గుమ్మకొండ పీర్లచావిడిల్లో పది రోజులుగా కొలువుదీరిన హరా రుషత్ మౌలాలి అల్లంల ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే చూపరులను ఆకర్షించేలా చావిడీలను విద్యుత్‌దీపాలతో రంగురంగుల కాగితాలతో అలకరించారు. కొడీ పీర్లు గ్రామంలోని పురవీధులల్లో ఊరేగిస్తూ అలా ఆడుతూ నృత్యాలు చేస్తూ యువకులు గ్రామస్థులు తమ భక్తిని చాటుకున్నారు. రాత్రి పొద్దుపోయాక సమీపంలోని బావికి తీసుకెళ్లడంతో ఉత్సవాలు ముగిశాయి.

ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల వేతనాలు పెంచాలి

నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు 6: చాలీ చాలని వేతనాలతో పని చేస్తున్న నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్ఎం) ఉద్యోగుల కనీస వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత పెంచాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.నరసింహ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏఐటీయూసీ కార్యాలయంలో ఎన్‌హెచ్ఎం మిడ్ లేవల్ హెల్త్ ప్రొవైడర్స్(ఎంఎల్‌హెచ్‌పీ) ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా మారేడు శివశంకర్, అధ్యక్షుడిగా సాయికుమార్, ప్రధాన కార్యదర్శిగా జి.కల్పన, ఉపాధ్యక్షులుగా పి.వరలక్ష్మీ, బి.శృతి, కార్యదర్శులుగా ఇప్పవన్‌కళ్యాణ్, కోశాధికారిగా ఆర్.రాజునాయక్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సాయికుమార్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్, కార్యదర్శి బండి లక్ష్మీపతి, నాయులు శివ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేస్తాం

కల్వకుర్తి, ఆగస్టు 6 : కల్వకుర్తి పట్టణంలోని డబుల్‌బెడ్రూం ఇండ్ల పెండింగ్ పనులను ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో పూర్తి చేయిస్తామని కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ తెలిపారు. మంగళవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి డబుల్‌బెడ్రూం ఇండ్లను పరిశీలించారు. అసంపూర్తి పనులకు ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.20లక్షలు మంజూరు చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, కౌన్సిలర్ గోరటి శ్రీనివాసులు, నాయకులు ఉన్నారు.

స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలి: కలెక్టర్



బ్యాంకులో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

నాగర్‌కర్నూల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛమైన మిషన్‌భగీరథ తాగునీటిని పట్టణంలోని ప్రతీ ఇంటికి చేరేవిధంగా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం కార్యక్రమం రెండవ రోజు తాగునీటి వనరుల దగ్గర శుభ్రం చేయడం, క్లోరినేషన్, టెస్టింట్ పనులను కలెక్టర్ పరిశీలించారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా నాగర్‌కర్నూల్ పట్టణం లోని 25వ వార్డులో మార్కెట్‌యార్డులో నిర్మితమైన నీటి ట్యాంక్‌ను పరిశీలిచారు. అనంతరం పట్టణంలోని కో ఆపరేటివ్ బ్యాంక్ సందర్శించి రైతులకు సంబంధించిన రుణమాఫీ ప్రక్రియను పరిశీలించారు. బ్యాంక్ అధికారులు పెండింగ్ లేకుండా అర్హులైన వారికి రుణమాఫీ డబ్బులు వెంటనే విడుదల చేయాలని సూచించారు. ఇప్పటి వరకు ఎంతమందికి రుణమాఫీ జరిగిందని ఇంకా ఎంతమందికి జరగాల్సి ఉంటుందని బ్యాంక్ అధికారులతో అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కమిషనర్ నరేష్‌బాబు, కో ఆపరేటివ్ చైర్మన్ బండారు శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులు ఉన్నారు.

9న ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

గిరిజనుల ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా ఈ నెల 9న ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ కే.సీతారామారావు, ఐటీడీఏ ప్రాజెక్టు డైరెక్టర్ రోహిత్‌గోపిడిలతో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. అందుకు కావాల్సిన ఏర్పాట్లు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆదివాసి ప్రజల జీవన విధానం గురించి విద్యార్థులతో వ్యాసరచన, చిత్రలేఖన, ముగ్గుల పోటీలను నిర్వహించాలని డీటీడబ్ల్యూవోను కలెక్టర్ ఆదేశించారు. సమావేశం లో ఆదివాసి గిరిజన సంఘాల నాయకులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప వ్యక్తి జయశంకర్

- ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి
- ప్రొఫెసర్, గద్దర్ చిత్రపటానికి నివాళి



కొల్లాపూర్‌లో జయశంకర్, గద్దర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి జూపల్లి

కొల్లాపూర్/నాగర్‌కర్నూల్ క్రైం/తాడూరు/ లింగాల/వెల్దండ/ఊర్కొండ/తిమ్మాజిపేట/నాగర్‌కర్నూల్ టౌన్/కోడేరు/కల్వకుర్తి/వంగూరు/అమ్రాబాద్/కొల్లాపూర్/తెల్లకపల్లి, ఆగస్టు 6: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ అని ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. మంగళవారం కొల్లాపూర్ క్యాంపు కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ 91వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా ప్రజా యుద్ధనౌక గద్దర్ ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్ర పటాలకు మంత్రి జూపల్లి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ పస్పుల నరసింహ, మునిసిపల్ కౌన్సిలర్ షేక్.రహీంపాషా, బరిగెల రాముడు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఎండి.ఎక్బాల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఆకునమోని రాముయాదవ్, బొరెల్లి మహేష్, కేతూరి ధర్మతేజ, ఖాదర్‌పాష, బచ్చులకూర బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

● నాగర్‌కర్నూల్ ఎస్పీ కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి ఏఎస్పీ రామేశ్వర్ పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఏఆర్ ఏడీఎల్ఎస్ పీటీ భరత్, ఏవో కృష్ణయ్య, సీఐ ఉపేందర్‌రావు, ఆర్ఐ జగన్, ఎంటీవో ఆర్ఐ రాఘవరావు, ఆర్ఎస్ఐ గౌస్‌పాషా, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● నాగర్‌కర్నూల్ పట్టణంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో, విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జయశంకర్ చిత్రపటానికి ఆయా సంఘం నాయకులు పూలమాలలు వేశారు.

● తాడూరు ఎంపీడీవో కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటం వద్ద ఎంపీవో బ్రహ్మాచారి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఏపీవో చంద్రసిద్దార్థ, సిబ్బంది, డిప్యూటీ తహసీల్దార్ మహ్మద్ ఆలీతోపాటు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● లింగాల మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల్లో జయశంకర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అంజనేయులు, డిప్యూటీ తహసీల్దార్ పట్టాభి, సిబ్బంది పాల్గొన్నారు.

● వెల్దండ ఎంపీడీవో కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి అధికారులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఈవో దేవసహాయం, మండల ప్రత్యేకాధికారి ఖాజా నజీం అలీ, ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డి, ఎంపీవో లక్ష్మణ్, సీనియర్ అసిస్టెంట్ రేవంత్‌రెడ్డి, ఈసీ దేవేందర్ తదితరులు ఉన్నారు.

● ఊర్కొండ మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం అధికారులు ప్రొఫెసర్ జయంశకర్ సార్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మణ్‌నాయక్, ఏపీవో నరసింహ, అధికారులు పాల్గొన్నారు.



జయశంకర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి

● తిమ్మాజిపేట : ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతిని మద్యం డిపోలో, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, ఎమ్మార్సీ భవనంలో, పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. కార్యక్ర మంలో మద్యం డిపో ఇన్‌చార్జ్ మేనేజర్ వసేప్, సూపర్‌వైజర్లు శివకుమార్, మధు, విజయలక్ష్మీ, ఎక్సైజ్ ఎస్ఐ బాలీశ్వరి, హమాలీ సంఘం నా యకులు పాల్గొన్నారు.

● కోడేరు మండల పరిధిలోని రాజాపూర్ జడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను నిర్వహించారు. అలాగే కోడేరు, నర్సాయిపల్లి, ఎత్తం తదితర గ్రామాల్లో జరుపుకున్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● కల్వకుర్తి పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో జయశంకర్ చిత్ర పటానికి ఆర్డీవో ఎస్.శ్రీను, ఎంపీడీవో ఎన్.వెంకట్రాములు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీవో రాజు, సిబ్బంది తదితరులు ఉన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జయశంకర్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ రాంరెడ్డి, అధ్యాపకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

● వంగూరు మండలంలోని ఉప్పల్‌పహాడ్‌లో జయశంకర్ చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకుడు కంకణాల నర్సిరెడ్డి నివాళి అర్పించారు. నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● అమ్రాబాద్ మండల పరిషత్ కార్యాలయం, గ్రామపంచాయతీ కార్యాలయాలు, వివిధ ప్రభుత్వ కార్యాలయాలలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అమ్రాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ మదన్మోహన్ ఆధ్వర్యంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాలచంద్ర సృజన్, ఈజీఎస్ ఏపీవో రఘు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● కొల్లాపూర్ పట్టణంలోని పాలమూరు యూనివర్సిటీ పీజీ కళాశాలలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్ర పటానికి కళాశాల ప్రిన్సిపాల్ మార్క్ పోలోనియత్ పూలమాల వేసి నివాళుల ర్పించారు. అలాగే, పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, ఎల్లూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, చింతలపల్లి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్ర పటానికి నివాళి అర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజావర్ధన్ రెడ్డి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

● తెలకపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమం లో తహసీల్దార్ పాండునాయక్, ఆర్ఐ రామ స్వామి, సీపీఎం నాయకులు విజయ్‌గౌడ్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో జయశంకర్ జయంతి

నాగర్‌కర్నూల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సిద్దాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లో 91వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్‌లు ప్రొఫెసర్ జయశంకర్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ భావజాలాన్ని ఎంతో గొప్పగా ముందుకు తీసుకెళ్లిన మహనీయుడని ప్రశంసించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతకు ప్రత్యేక దృష్టి సారించాలి



అచ్చంపేటలో డ్రైనేజీలో పూడిక తీస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ



వెల్దండ మోడల్‌స్కూల్ ప్రాంగణంలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

అచ్చంపేట , ఆగస్టు 6: ప్రతీ ఒక్కరు పరిసరాల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని మల్లంకుంట సమీపంలో కార్మికులతో కలిసి డ్రైనేజీలు శుభ్రం చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ శ్రీనివాసులు, నాయకులు గౌరీశంకర్, అధికారులు పాల్గొన్నారు.

లింగాల : మండల పరిధిలోని వల్లభాపూర్, రాంపూర్ గ్రామాల్లో మంగళవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అంజనేయులు, ఏపీవో హేమామలి, కార్యదర్శులు పాల్గొన్నారు.

వెల్దండ : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి సూచించారు. స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక మోడల్ స్కూల్ ప్రాంగణంలో ఎమ్మెల్యే హాజరై మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు భూపతిరెడ్డి, వెంకటయ్యగౌడ్, సంజీవ్‌కుమార్, మోతీలాల్, రషీద్, పుల్లయ్య, పర్వత్‌రెడ్డి, వెంకటయ్య యాదవ్, ఎర్రశ్రీను, పోలేరాజు, శ్రీనుయాదవ్, అలీ, వెంకటేష్, తానీషా, కాదురాం తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పుష్పలత తదితరులున్నారు.

చారకొండ: మొక్కల పెంపకంతోనే భవిష్యత్ తరాలకు మనుగడ సాధ్యమని అదనపు కలెక్టర్ సీతారామరావు అన్నారు. మండలంలోని జూపల్లిలో మంగళవారం ప్రత్యేక అధికారి తహసీల్దార్ కేసీ ప్రమీల ఆధ్వర్యంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. అదనపు కలెక్టర్ హాజరై మొ క్కలు నాటారు. అనంతరం డంపింగ్‌యార్డు, కం పోస్టు షెడ్డులను పరిశీలించారు. అదేవిధంగా సారబండతండాలో ఎంపీడీవో ఇసాక్‌హుసేన్ నర్సరీ, సిగ్రిగేషన్ షెడ్, పాఠశాలను పరిశీలించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీపీవో కృష్ణ, డీఎల్‌పీవో శ్యాంసుందర్, ఎంపీవో వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కల్వకుర్తి: పక్కా ప్రణాళికతో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని అమలు చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ కే.సీతారామారావు అన్నారు. మంగళవారం కల్వకుర్తి పట్టణంలో అధికారులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఆయన వెంట కల్వకుర్తి ఆర్డీవో ఎస్.శ్రీను, తహసీల్దార్ ఇబ్రహీం, మునిసిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్: కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని వార్డుల్లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం కొనసాగించారు. మంగళవారం మునిసిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్యా 17, 18వార్డుల్లో కమిషనర్ శ్రీనివాసన్, కౌన్సిలర్లు కర్ని ఆలివేలతో కలిసి మొక్కలు నాటారు. అలాగే 11వ వార్డులో కౌన్సిలర్ బొరెల్లి కరుణమ్మ ఆధ్వర్యంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ ఏఈ హేమలత, విద్యుత్ ఏఈ రాకేష్‌రెడ్డి, నాయకులు బొరెల్లి మహేష్, నరసింహ, విష్ణుయాదవ్ పాల్గొన్నారు.

అందరి బాధ్యత

నాగర్‌కర్నూల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ప్రతి ఒక్కరు మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని మినీట్యాంక్ బండ్ వద్ద జరిగిన స్వచ్ఛదనం- ప చ్చదనం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మె ల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి మొక్కలు నా టారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ కల్పన, కమిషనర్ నరేష్‌బాబు, కౌన్సిలర్లు కొత్త శ్రీను, నిజాం, రాజు, సునేంద్ర పాల్గొన్నారు.



జూపల్లిలో మొక్క నాటుతున్న అదనపు కలెక్టర్ సీతారామారావు



నాగర్‌కర్నూల్ మినీ ట్యాంక్‌బండ్ వద్ద మొక్క నాటుతున్న ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

డబుల్‌బెడ్రూం ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి బాల్‌నరసింహ

కల్వకుర్తి, ఆగస్టు 6 : కల్వకుర్తి పట్టణంలో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇండ్లను వెంటనే లబ్ధిదారులకు అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బాల్ నరసింహ డిమాండ్ చేశారు. కల్వకుర్తి పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో సీపీఐ కల్వకుర్తి మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై తీర్మాణాలు చేశారు. సమావేశంలో సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జి పులిజాల పరుశరాములు, నాయకులు గడ్డం శ్రీనివాసులు, జగన్, కాశన్న, రాజు, పురుషోత్తం, ఈశ్వర్, పరుశరామ్ ఉన్నారు.

రేషన్ బియ్యం పక్కదారి

చారకొండ, ఆగస్టు 6: రేషన్‌బియ్యం పక్కదారి పడుతున్న అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. మండల పరిధిలోని కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారి గోకారం గేటు నుంచి గోకారం గ్రామానికి వెళ్లే దారిలో మంగళవారం పట్టపగలే యథేచ్ఛగా రేషన్ బియ్యాన్ని బొలేరో వాహనంలో లోడు చేసి కల్వకుర్తికి తరలిస్తున్నారు. దీంతో దళారులు రేషన్ బియ్యాన్ని అధిక ధరలకు మిల్లులకు తరలించి సొమ్ము చేసుకొంటున్నారు. సంబంధిత అధికారులు రేషన్‌బియ్యం దందాపై నిఘాపెట్టి అరికట్టాలి.

డ్రంకెన్‌డ్రైవ్‌లో వ్యక్తికి జైలు శిక్ష

వంగూరు ఆగస్టు 6: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఓ వ్యక్తికి మంగళవారం కల్వకుర్తి న్యాయాధికారి జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు. ఈ నెల 3న మండలంలోని శ్రీశైలం క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా తుమ్మలపల్లి గ్రామానికి చెందిన గందం శ్రీశైలం మద్యం తాగి ట్రాక్టర్ నడుపుతూ పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసి కల్వకుర్తి న్యా యాధికారి ముందు హాజరు పరచగా అతడికి రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

కల్వకుర్తిటౌన్: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన విభూతి రామస్వామి అనే వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష, జరిమానా విధించినట్లు మంగళవారం ఎస్ఐ మాధవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్చరించారు.

'కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలి'

అమ్రాబాద్, ఆగస్టు 6: అమ్రాబాద్ మండల కేంద్రంలోని కోదండ రామాలయానికి చెందిన భూమి కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవా లని ఆలయ పూజారి శ్రీనివాసాచార్యులు, వివిధ పార్టీల, సంఘాల నాయకులు కోరారు. మంగళవారం రెవెన్యూ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ రావుఫ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వడుగుల శ్రీనివాసులు, పోల సత్యనారాయణ, బొడ్డుపల్లి శ్రీనివాసులు, ఉప్పల పరమేష్, జగన్‌గౌడ్, ఎల్జాల శ్రీను తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరిస్తా

కోడేరు, ఆగస్టు 6 : మండల పరిధిలోని రాజాపూర్ గ్రామంలో నెలకొన్న సమస్యలు కలెక్టర్‌తో మాట్లాడి పరిష్కరిస్తానని మంత్రి జూపల్లి కృష్ణారావు హామీ ఇచ్చారని సీపీఎం మండల కార్యదర్శి ఎండి.మాలిక్ తెలిపారు. పలు సమస్యలపై మంగళవారం మంత్రికి వినతి పత్రం ఇవ్వగా సానుకూలంగా స్పందించారన్నారు. నాయకులు బి.బాలయ్య, సి.బాలస్వామి, బి.భగవంతు, రైతులు పాల్గొన్నారు.

ఆస్పత్రిపై చర్యలు తప్పవు: ఎమ్మెల్యే

కందనూలు, ఆగస్టు 6 : జిల్లా కేంద్రంలోని ప్రియాంక ఆసుపత్రిపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే కావ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా పలువురు ఆసుపత్రి వైద్యురాలు నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

పలు ఇళ్లలో చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం, ఆగస్టు 6 : జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డులో గల డిగ్రీ కళాశాల పరిసర ప్రాంతంలో ఇటీవల పలు ఇళ్లల్లో గుర్తు తెలియని దుండగులు దొంగతనాలకు పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఉప్పల సుధాకర్ నివాసంలో ఇంటి తలుపులు పగుల కొట్టి చోరీకి ప్రయత్నించారు. తలుపులు రాకపోవడంతో ఇంటికి అమర్చిన సీసీ కెమెరాలు ధ్వంసం చేశారు. అదే కాలనీలో దస్తగిరిఖాన్ అనే వ్యక్తి ఇంట్లోకి చొరబడి బీరువాలో బంగారు కమ్మలను ఎత్తుకెళ్లారు. శ్రీపురం రహదారిలో ఉన్న కొరియర్ కార్యాలయానికి వేసిన తాళాలను ఇనుప రాడ్డు తో బద్దలు కొట్టారు. అదే ప్రాంతంలో రఫీ అనే వ్యక్తి ఇంట్లో చొరబడి నాలు గు డ్రిల్‌మిషన్లను అపహరించుకుని వెళ్లారు.

రుణమాఫీ కోసం బ్యాంకు వద్ద బారులు

కల్వకుర్తిటౌన్, ఆగస్టు 6 : ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీని పొందేందుకు రైతులు మంగళవారం ఎస్‌బీఐ వద్ద బారులు తీరారు. రైతులు అందరు ఒకేసారి వివరాలు తెలుసుకునేందుకు రావడంతో బ్యాంకు వద్ద తోపులాట నెలకొంది బ్యాంకు సిబ్బంది సర్దిచెప్పడంతో రైతులు నెమ్మదించారు. రుణమాఫీకి అర్హులైన ప్రతీ రైతుకు అదే విధంగా చూస్తామని, ఇందుకు తమ పొలం పాస్‌బుక్, ఆధార్ కార్డు, రుణఖాతా వివరాలను బ్యాంకు తెలియాజేలని బ్యాంకు మేనేజర్ శాంతన్‌పాల్, ఫీల్డ్ ఆఫీసర్ శివ రైతులకు సూచించారు.

బాధితుడికి ఆర్థిక సాయం

వెల్దండ, ఆగస్టు 6 : రోడ్డుప్రమాదంలో గాయపడి సర్జరీ చేయించుకున్న మండలకేంద్రానికి చెందిన రాముకు సైనిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సైనికులు సమకూర్చిన రూ. 15వేల నగదును బాధితునికి అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రవీన్‌కుమార్‌రెడ్డి, సభ్యులు విష్ణుగౌడ్, విజేందర్‌గౌడ్ తదితరులున్నారు.

ర్యాలీని విజయవంతం చేయాలి

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 6 : కొల్లాపూర్ పట్టణంలో బుధవారం నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ ర్యాలీని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి చెల్లపాటి రాజమౌళి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు హర్షదాయమని ఆయన అన్నారు. ర్యాలీలో మాదిగలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రజలకు అండగా ఉంటా

తాడూరు, ఆగస్టు 6 : ప్రజలకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఇటీవల సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన 38మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ రాంచంద్రారెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు మందడి రోహిణి, నాయకులు పాల్గొన్నారు.

గద్దర్ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ

అచ్చంపేటటౌన్ , ఆగస్టు 6: గద్దర్ గళం నుంచి జాలువారిన ఎన్నో పాటలు నేటి తెలంగాణ ఆవిర్భావానికి పునాదులు అయ్యాయని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ప్రజాయుద్ధ నౌక గద్దర్ ప్రథమ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని బస్టాండ్ ఆవరణ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అలాగే బస్టాండ్ సమీపంలోని ఆమరవీరుల స్థూపం వద్ద గద్దర్ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజలు చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.

● వెల్దండ: ప్రజాయుద్ధనౌక గద్దర్ వర్ధంతిని మంగళవారం వెల్దండ, పెద్దాపూర్ గ్రామాలలో జరుపుకున్నారు. ఆయా గ్రామాలలో గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వెల్దండలో ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో నాయకులు భూపతిరెడ్డి, కేశమళ్ల కృష్ణ, వెంకటయ్యగౌడ్, శేఖర్, మట్ట వెంకటయ్యగౌడ్, భిక్షపతి, పర్వత్‌రెడ్డి, మోతీలాల్, యాదగిరి, రషీద్, ఎర్రశ్రీను, పుల్లయ్య, శ్రీనుయాదవ్, వెంకటేష్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శేఖర్, మొగులయ్య, నర్సింహ, నారాయణ తదితరులున్నారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

తిమ్మాజిపేట, ఆగస్టు 6 : రైతుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి నేటితో ముగియనుందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ విస్తరణాధికారి సాయిరాం అన్నారు. తిమ్మాజిపేట మండలంలోని ఆయా క్లస్టర్ల రైతు వేదికలలో మంగళవారం రైతు బీమా పథకానికి సంబంధించిన దరఖాస్తులను, రైతుల ద్వారా ఏఈవోలు స్వీకరించారు.

రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి

తిమ్మాజిపేట, ఆగస్టు 6 : రైతుకు ఎరువులు, విత్తనాలు పురుగుల మందులు అమ్మకాలకు సంబంధించిన రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్ సూచించారు. తిమ్మాజిపేటలో ఆగ్రో రైతు సేవా కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ప్రజాకళల పండుగను విజయవంతం చేయాలి

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 6 : హైదరాబాద్‌లో నేడు నిర్వహించనున్న ప్రజాకళల పండుగను విజయవంతం చేయాలని ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్షుడు తుపాకుల వెంకటేష్, ప్రధాన కార్యదర్శి పెబ్బేటి విజయ్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. 33 జిల్లాల నుంచి కళాకారులు పాల్గొంటారని పేర్కొన్నారు.